సాక్షి
జనగామ
శుక్రవారం । 28 । జూన్ । 2024



గ్రేటర్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో▸



కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా

కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో గురువారం సాయంత్రం జరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం $30^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో డీఎఫ్‌ఓ పూజలు



పాలకుర్తి టౌన్ : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో గురువారం జిల్లా అటవీ శాఖాధికారి లావణ్య కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు అవార్డులు

జనగామ: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీన కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు అవార్డులు అందించనుంది. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు చౌడేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులతో పాటు డిజైనర్లు, వృత్తిలో నైపుణ్యత, ప్రత్యేకతలు కలిగిన వారిని అవార్డుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి రూ.25వేల నగదు పురస్కారం, మెమొంటో, సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అవార్డుకు అర్హతలు చేనేత కళాకారుల వయసు 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి 30 ఏళ్లు నిండి, ఈ రంగంలో 10 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలన్నారు. చేనేత డిజైనర్ల వయసు 25 ఏళ్లు నిండి, రంగంలో ఐదేళ్లకు తగ్గకుండా అనుభవం కలిగిన వారు జూలై 10లోపు కలెక్టరేట్‌లోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఔషధ కంపెనీపై క్రిమినల్ కేసు



స్టేషన్‌ఘన్‌పూర్: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కోర్‌బ్యాక్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తెలిపారు. ఆ శాఖ వరంగల్ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ, భూపాలపల్లి జిల్లా ఔషధ తనిఖీ అధికారులు ఎ.బాలకృష్ణ, పి.పావని ఘన్‌పూర్‌లోని మెడికల్ షాపులను గురువారం తనిఖీ చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కోర్‌బ్యాక్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీకి చెందిన ఇట్రాగ్రిల్ 200 ఎంజీ క్యాప్సుల్స్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక రేటు ముద్రించి మార్కెటింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఒక క్యాప్సుల్ ధర రూ.24కు బదులు రూ.29గా ముద్రించి విక్రయిస్తున్నందుకు ఔషధ ధరల నియంత్రణ చట్టం–2013 పారా 14(1), 14(2) ప్రకారం సదరు కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే ఆ క్యాప్సుల్స్‌ను సీజ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించినట్లు ఔషధ నియంత్రణశాఖ అధికారులు తెలిపారు.

కల్తీ పెట్రోల్ పోశారని ఆందోళన



స్టేషన్‌ఘన్‌పూర్: కల్తీ పెట్రోల్ పోశారని ద్విచక్ర వాహనదారుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా డీటీ విజయ్‌కుమార్ తనిఖీ చేసిన సంఘటన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన ఉన్న పెట్రోల్ బంకులో చోటుచేసుకుంది. రంగరాయగూడెంకు చెందిన ఐత రమేష్ తన బైక్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద గురువారం రూ.520 పెట్రోల్ పోసుకున్నాడు. కొద్ది దూరం వెళ్లాక బైక్ ఆగిపోవడంతో మెకానిక్‌కు చూపించాడు. అతను ఇంజన్ చెక్ చేసేందుకు పెట్రోల్ తీయగా నీరు కలిసి ఉన్నట్లుగా గుర్తించారు. ఆ పెట్రోల్‌ను బాటిల్‌లో పట్టుకుని బంక్ వద్దకు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించాడు. ఇక్కడ నాణ్యమైన పెట్రోల్ పోస్తామని, తమ తప్పేమి లేదని చెప్పడంతో బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. డీటీ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని బంక్‌లో ఉన్న పెట్రోల్‌ను తనిఖీ చేశారు. నాణ్యమైన పెట్రోల్ అని నిర్ధారించారు.

బకాయి రూ.17.75 కోట్లు

వసూళ్లపై ఆర్టీఏ అధికారుల నజర్
- 3,389 వాహనాల యజమానులకు షోకాజ్ నోటీసులు
- 60 జీపీ వాహనాలకు నో రిజిస్ట్రేషన్
- మున్సిపల్ వెహికిల్స్ పత్రాల జాడలేదు

జనగామ: తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖలో పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలపై దృష్టి సారించింది. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సమీకరణ నేపథ్యంలో ప్రభుత్వం పాత ట్యాక్స్, జరిమానాల వసూళ్లకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా రూ.17.75 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఆయా వాహనాల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి.. సకాలంలో చెల్లించని పక్షంలో రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ పరిధిలో 3,389 వాహనాల(ట్రాక్టర్లు, లారీలు, 10 సీటర్ మాక్సి క్యాబ్, హార్వెస్టర్లు, తదితర) ద్వారా ట్యాక్స్, జరిమానా కలుపుకుని రూ.17.75 కోట్లు బకాయి ఉంది. ఇందులో వాహనాలపై రెగ్యులర్‌గా వచ్చే పనులు రూ.11.93 కోట్లు. వీటిపై జరిమానా రూ.5.82 కోట్లు ఉంది. గడిచిన రెండేళ్ల నుంచి పెండింగ్ ఉండడంతో ప్రభుత్వానికి రావాల్సి ఆదాయంలో జాప్యం జరుగుతోంది. గత సర్కారు దీనిపై పెద్దగా దృష్టిసారించక పోవడం.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల కొరత గుదిబండగా మారడంతో పెండింగ్ బకాయిలపై దృష్టి సారించింది. ఏళ్ల తరబడి ట్యాక్స్



బస్సు పత్రాలు తనిఖీ చేస్తున్న అధికారి

చెల్లించకుండా కాలయాపన చేస్తున్న యజమానులకు ఇటీవల రవాణా శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బకాయిలు చెల్లించని పక్షంలో వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని అందులో పేర్కొన్నారు.

పన్నులు ఇలా..

వాహనాలకు(మూడు చక్రాల ఆటోలు మినహా) ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మొదటి క్వార్టర్ చెల్లింపు ఆలస్యమైనా.. జరిమానాకు మినహాయింపు ఇస్తారు. రెండవ క్వార్టర్ వరకు కూడా చెల్లించని పక్షంలో 25 శాతం, మూడవ క్వార్టర్‌కు 50 శాతం ఫెనాల్టీతో ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ట్యాక్స్ చెల్లించకుండా రోడ్డుపై తిరుగుతూ ఆర్టీఏ అధికారులకు పట్టుబడిన క్రమంలో అసలు ట్యాక్స్‌కు తోడు 100శాతం జరిమానా విధిస్తారు. ఇందులో నాలుగు చక్రాల వాహనాలకు మూడు నెలల ట్యాక్స్ రూ.570, ఆల్ ఇండియా పర్మిట్ బస్సుల్లో ఒక్కో సీటుకు రూ.3,500, స్టేట్ పర్మిట్ బస్సు ఒక్కో సీటుకు రూ.2,500, మినీగూడ్స్ వెహికిళ్లకు రూ.850, మ్యాక్సీ క్యాబ్ ఒక్కో సీటుకు రూ.820, పది టైర్ల లారీకి రూ.8,400, 12 టైర్ల లారీకి రూ.11,000, స్కూల్ బస్సుకు యావరేజ్‌గా ఒక్కో సీటుకు రూ.500 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఐదు క్వార్టర్ల వరకు ట్యాక్స్ చెల్లించని వాహన యజమానులకు ఆర్టీఏ అధికారుల నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు.

అసలు పత్రాలే లేవు..

జనగామ పురపాలికలో శానిటేషన్, వాటర్, జేసీబీ, ఇతర వాహనాలకు సంబంధించి కొన్నింటికి రిజిస్ట్రేషన్ చేయించ లేదు. క్వార్టర్ ట్యాక్స్‌లు సైతం పెండింగ్‌లో ఉంచారు. వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించాలని అధికారులు చెబుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనాలు కొనుగోలు చేసిన సమయంలో షోరూం నుంచి వచ్చిన పత్రాల జాడ లేకపోవడంతో పురపాలిక వాహనాల ప్రయాణం గాలిలో దీపంలా మారిపోయింది.

స్కూల్ బస్సులకు నోటీసులు

జిల్లాలో ఫిట్‌నెస్, పర్మిట్ చేయించడంలో జాప్యం చేస్తున్న 21 స్కూల్ బస్సుల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో 14 ఏళ్ల సర్వీసు నిండిన బస్సులతో పాటు డిస్పోజ్‌కు పంపించేందుకు సిద్ధంగా ఉన్నాయి. కాగా బస్సు కొనుగోలు చేసి 9, 10, 11, 12 సంవత్సరాలు పూర్తయినా.. పాఠశాలల యజమానులు ఫిట్‌నెస్, పర్మిట్ చేయించడంలో జాప్యం చేస్తున్నారు. వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరారు.

60 జీపీల వాహనాలకు రిజిస్ట్రేషనే లేదు..

జిల్లాలోని 60 గ్రామ పంచాయతీల పరిధి ట్రాక్టర్లకు, డబ్బాలు, వాటర్ ట్యాంకర్లకు ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించలేదు. బీఆర్‌ఎస్ హయాంలో మూడేళ్ల క్రితం కొనుగోలు చేసిన ట్రాక్టర్ల మెయింటనెన్స్‌ను గాలికి వదిలేశారు. చిన్న జీపీల్లో నిధుల లేమీతో ట్రాక్టర్ల నిర్వహణ అదనపు భారంగా మారింది. రిజిస్ట్రేషన్ చేయించకుండా నిర్లక్ష్యం చేస్తున్న జీపీలకు నోటీసులు సైతం జారీ చేశారు.

పెండింగ్ ట్యాక్స్ చెల్లించాల్సిందే..



జిల్లాలో ట్యాక్స్‌లు, జరిమానా కలుపుకుని రూ.17.75కోట్లు పెండింగ్ ఉన్నాయి. ఇందులో 3,389 మంది యజమానులకు షోకాజ్ నోటీసులు పంపించాం. తప్పనిసరి చెల్లించాల్సిందే. నూరు శాతం వసూళ్లే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ఫిట్‌నెస్, పర్మిట్ చేయించుకోని 21 స్కూల్ బస్సుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం.

– జీవీ.శ్రీనివాస్ గౌడ్, రవాణాశాఖ జిల్లా అధికారి

సీఎం నేటి వరంగల్ పర్యటన వాయిదా

- రేపు రానున్న రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ పర్యటన ముగియకపోవడంతో చివరి నిమిషంలో మార్పు



సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన ఒకరోజు తరువాత వాయిదా పడింది. సీఎం అయ్యాక తొలిసారిగా శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నట్లు గురువారం సాయంత్రం అధికారిక టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఆయన ఢిల్లీ పర్యటన ముగియకపోవడం, శుక్రవారం అక్కడే ఉండాల్సి ఉండడంతో చివరి నిమిషంలో వరంగల్ పర్యటన వాయిదా వేశారు. శనివారం ఆయన పర్యటన యధావిధిగా కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అంతకు ముందు సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు గురువారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గీసుగొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్క్ సమీపంలో హెలిపాడ్ నిర్మాణంతోపాటు జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మహిళా శక్తి పథకం కింద మహిళలకు సీఎం చేతుల మీదుగా అందించనున్న చెక్కులకు తగిన ఏర్పాట్లు చేయాలని, కొత్తగా నిర్మాణంలో ఉన్న హెల్త్ సిటీ సందర్శనకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మెగా టెక్స్‌టైల్ పార్క్‌లోని ఏర్పాట్లను కలెక్టర్, సీపీ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. భద్రతపై సీపీ సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.

‘టామ్‌కామ్’లో ఉద్యోగ అవకాశాలు

జనగామ: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ టామ్‌కామ్, ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలో రిజిస్టర్ చేసుకున్న ఏజెన్సీ ద్వారా జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన వారికి శిక్షణ ఇచ్చిన తర్వాత నియామకం చేస్తారని, హాస్పిటాలిటీ రంగంలో నైపుణ్యం కలిగిన అర్హులకు రూ.ఒక లక్ష నుంచి రూ.15లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా లేదా డిగ్రీ లేదా హోటల్ పరిశ్రమలో ఎఫ్‌అండ్‌బీ అనుభవం, వయసు 22 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషలో రెసిడెన్షియల్, వృత్తిపరమైన శిక్షణ నైపుణ్యాలను అందిస్తారని, ఆసక్తి ఉన్నవారు టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో ఈనెల 30వ తేదీ వరకు పేర్లు నమోదు చేసు కోవాలన్నారు. మరిన్ని వివరాలకు టామ్‌కామ్–8125251408 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సెంట్రల్ వర్సిటీ వీసీని తొలగించాలి



వీసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ : స్టూడెంట్స్ యూనియన్ హక్కులపై నిరసన తెలియజేయడానికి వచ్చిన విద్యార్థి నాయకులను సస్పెండ్‌చేసిన సెంట్రల్ యూనివర్సిటీ వీసీని విధుల నుంచి తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. గురువారం నెహ్రూ పార్క్ వద్ద వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సస్పెన్షన్‌కు గురైన ఐదురుగు విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందినవారని, సస్పెన్షన్ ఎత్తివేసే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పొదల లవకుమార్, మామిడాల రమేష్, ఆర్య, విద్యార్థిసంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్



మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

బచ్చన్నపేట : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, కేసుల ఫైళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్‌కు అలవాటుపడి చాలా మంది భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ముందస్తుగా జాగ్రత్త పడాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపొద్దని, త్రిపుల్ రైడింగ్ చేయొద్దని చెప్పారు. సీసీ కెమెరాలతో దొంగతనాల నియంత్రణ సాధ్యమని, ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలన్నారు. భూసమస్యలను రెవెన్యూ కార్యాలయంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కంకల సతీష్‌కుమార్, కానిస్టేబుళ్లు బి.రాజు, జమాలొద్దీన్‌అనిల్, యాదగిరి, రాకేష్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో జలమయమైన హైదరాబాద్ రోడ్డు



జోరు వాన

జిల్లాలో గురువారం జోరు వాన కురిసింది. జనగామ పట్టణంలో గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు, హైదరాబాద్ రోడ్డు జలమయమైంది. డ్రెయినేజీల్లోని మురుగు నీరు రహదారులపైకి రావడంతో దుర్గంధ భరితంగా మారిపోయింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరైన జనం.. చల్లని వానతో ఉపశమనం పొందారు. – జనగామ



జనగామ ఆర్టీసీ చౌరస్తాలో..



జోరు వర్షంలో బైక్‌పై ప్రయాణం..

రిజర్వేషన్ సమస్య పరిష్కరించాలి

- టీజీమెపా రాష్ట్ర అధ్యక్షుడు పి.దేవేందర్

హన్మకొండ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు, మేనిఫెస్టోలో పేర్కొన్న ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ‘మెపా’ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌ల చిరకాల వాంఛ అయిన బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మారుస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. లేని ఎడల త్వరలోనే పోరాటానికి భవిష్యత్ కార్యాచరణను తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

మహిళా శక్తిని చాటి చెప్పాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: కొత్త కొత్త రంగాల్లో ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యత ఇస్తూ మహిళా శక్తిని చాటుతూ ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సీసీలు, ఏపీఎంలు, వీఓలకు మహిళా శక్తి పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలకు జీవనోపాధితో పాటు వారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 466 మంది వీఓలు, 11,201 స్వయం సహాయక సంఘాలు, 1,25,716 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని చెప్పారు. ఈ సంఘాల ద్వారా మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, సంఘంలో సభ్యత్వం ఉన్న మహిళకు మాత్రమే ఆయా పథకాలతోపాటు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు వస్తాయని చెప్పారు. మైక్రో యూనిట్ల ఏర్పాటుకు 25 మందిని గుర్తించి మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల అకౌంటింగ్ యాప్‌లో ఎప్పటికప్పుడు సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకానికి రూ.3లక్షలు, పాడి, పశు పోషణ, సంరక్షణ కింద రూ.50వేల రుణం తీసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వయసు 18 ఏళ్లు నిండి, ఇంటర్ ఉత్తీర్ణత సాధించి అర్హత కలిగిన వారికి మీ–సేవ కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం బ్యాంకు ద్వారా 35 శాతం సబ్సిడీతో రుణం, సంఘంలో లేని 1,800 మంది మహిళలు సభ్యత్వం తీసుకుని మహిళా శక్తి పథకానికి అర్హత సాధించాలని సూచించారు. కొత్తగా వెదురు తయారీ యూనిట్, బ్యాండ్ సెట్, డిటర్జెంట్ పౌడర్, సోప్ తయారీ, తేనె సేకరణ, జ్యూట్ బ్యాగుల తయారీ యూనిట్లు, రెడీమేడ్ గార్మెంట్స్, డిజిటల్ నెట్‌వర్క్, డయాగ్నోస్టిక్, ట్యూషన్ సెంటర్, బ్యూటీ పార్లర్, పే–యూజ్ టాయిలెట్స్, లాండ్రీ షాపులు, స్టీల్ దుకాణాలు, ఐస్ క్రీమ్ పార్లర్ తదితర యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ మొగులప్ప, డీపీహెచ్ఓ ఎస్‌ఎల్.మనోహర్, ఏపీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు వేగంగా చేపట్టాలి



విష్ణుమూర్తిని సన్మానిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద ఎంపిక చేసిన ప్రభుత్వ స్కూళ్లలో చేపట్టిన పనులు జూలై 7వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంఎన్‌ఓలు, ఎంపీఓలు, ఏఈలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పర్యవేక్షణలో 291 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. 236 స్కూళ్లలో 100 శాతం పూర్తికాగా.. మిగిలిన 55 పాఠశాలల్లో 75 శాతం వరకు చేరుకున్నాయని చెప్పారు. లింగాలఘణపురం మండల పరిధి వంద శాతం పనులు పూర్తి కావడంతో ఎంఎన్‌ఓ విష్ణుమూర్తి, ఎంపీడీఓ జలందర్‌రెడ్డి, ఏఈ పూర్ణచందర్, మండల ప్రత్యేక అధికారి కేఆర్.లతను కలెక్టర్ రిజ్వాన్ బాషా సత్కరించారు.

మిషన్ భగీరథ సర్వేపై సమీక్ష

మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియ వేగంగా చేపట్టాలని, వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ గ్రామాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఈఓ రాము, డీఆర్డీఓ మొగులప్ప, సీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న జాక్ బాధ్యులు

కేయూ క్యాంపస్ : కేయూలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తక్షణమే స్కేల్ అమలుచేస్తూ, రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ(కుక్టా జాక్) బాధ్యులు గురువారం హనుమకొండలో అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. వరంగల్‌కు రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. నాయకులు డాక్టర్ కరుణాకర్‌రావు, ప్రవీణ్, సాధు రాజేష్, చిర్ర రాజు, ఫిరోజ్ పాషా, రవీందర్, గజ్జల మల్లేష్, ఆరూరి సూర్యం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసొసైటీలకు నగదు జమచేయాలి



ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మత్స్యకారులకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేప పిల్లల పథకానికి బదులు సొసైటీలకే నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా నాయకులు గురువారం హన్మకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరం ఉచిత చేపపిల్లల పథకానికి రూ.200 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, మత్స్యపరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రితోపాటు రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలన్నారు. ప్రతి సొసైటీకి రూ.10 లక్షలు, మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ, మహిళా మత్స్యసొసైటీలకు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజేందర్, గొడుగు వెంకట్, జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి బిక్షపతి, సహాయ కార్యదర్శి నీరటి చంద్రయ్య, కమిటీ సభ్యులు కండ్లకోల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలెక్కడ?

- బీఆర్‌ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని బీఆర్‌ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్‌వీ) కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ విమర్శించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విద్యార్థి విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాచర్ల శరత్ చంద్ర, కంజర్ల మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వనదేవతల కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : వనదేవతలు సమ్మక్క, సారలమ్మల హుండీల కానుకలను గురువారం మేడారంలోని దేవాదాయశాఖ కార్యాలయం డార్మెటరీ భవనంలో లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ.. పూజారుల సమక్షంలో హుండీల కానుకల లెక్కింపు చేపట్టారు. ఇందులో సమ్మక్క హుండీ ఆదాయం రూ. 21,83,867, సారలమ్మ ఆదాయం రూ. 17,58,83, గోవిందరాజు ఆదాయం రూ. 1,13,998, పగిడిద్దరాజు ఆదాయం రూ. 1,54,954 మొత్తం రూ. 42,10,902 లభించినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఇన్‌స్పెక్టర్ అనిల్, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు వసంతరావు, ప్రధాన పూజారి అరుణ్‌కుమార్, కాక కిరణ్, పూజారుల సంఘం ఉపాధ్యక్షుడు చందా గోపాల్, సిద్దబోయిన భోజరావు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో రైతు మృతి

- తాళ్లపూసపల్లిలో ఘటన



ప్రకాశ్(ఫైల్)

కేసముద్రం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని తాళ్లపూసపల్లిలో జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాలేరు ప్రకాశ్(48) తన పంట పొలం వద్ద నారుమడికి నీళ్లు పారించేందు స్టార్టర్‌ను ఆన్‌చేయగా మోటార్ నడవలేదు. దీంతో మోటార్‌కు కనెక్షన్ ఉన్న తీగను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే ఫెయిల్ అయిన తీగ అతడి చేతికి తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరకుని మృతదేహంపై పడి బోరున విలపించారు. పోలీసులు.. ప్రకాశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు.





పార్కులోని పరిశ్రమలు

వస్త్రనగరికి మహర్దశ పట్టేనా!

టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 706.87 కోట్లు ఖర్చు

- నిధులన్నీ బీఆర్ఎస్ సర్కారు కేటాయించినవే
- ఇప్పటి వరకు నిధులు ఇవ్వని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు
- త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయిస్తే మేలు
- నిధుల మంజూరుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారనే ఆశ



గణేశా ఎకోటెక్ కంపెనీ

ఓ వైపు.. వస్త్ర ఉత్పత్తి.. మరోవైపు.. చేనేత కార్మికులకు చేతినిండా పని.. ఇంకో వైపు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్(వస్త్ర నగరి) పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ఈ పార్కు అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. అప్పుడే పార్కులో మౌలిక వసతులు ఏర్పాటై నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగినన్ని నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

గీసుకొండ : వరంగల్ జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత నిధులు కేటాయిస్తేనే పార్కులో మౌలిక వసతుల కల్పన చేయడానికి, తమ యూనిట్లను నెలకొల్పడానికి వచ్చే వస్త్ర కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పలు కంపెనీలు ముందుకు వస్తేనే వస్త్రాల ఉత్పత్తితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2017 అక్టోబర్ 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. పార్కు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో 22 కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయని అధికారులు తెలిపారు. కరోనా తర్వాత రెండేళ్ల క్రితం నుంచి పనులు పుంజుకున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా ఉన్న గణేశా ఎకోటెక్ కంపెనీ ముందుగా ఏర్పాటై వినియోగించి పడేసిన ప్లాస్టిక్ నుంచి దారం(యార్న్) తయారు చేస్తోంది. పిల్లల దుస్తుల తయారీకి కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ కంపెనీకి అప్పటి మంత్రి కేటీఆర్ 2022 మే 7న శంకుస్థాపన చేశారు. తర్వాత దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ ఏర్పాటుకు కేటీఆర్ 2023 జూన్ 17న భూమిపూజ చేశారు. ప్రస్తుతానికి ఈ రెండు కంపెనీల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

పీఎం మిత్ర నిధులపై ఆశలు..!

ప్రధాని నరేంద్ర మోదీ 2023 మార్చి 17న కేఎంటీపీని 'ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర)' కింద ఎంపిక చేశారు. దేశంలో పీఎం మిత్ర కింద ఎంపికైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో కేఎంటీపీ ఒకటి. బ్రౌన్ ఫీల్డ్ కింద ఈ పార్కు అభివృద్ధికి తొలి విడతగా కేంద్రం రూ.200 కోట్లు కేటాయించిందని అధికారులు చెబుతున్నా అవి ఇంకా విడుదల కాలేదని తెలుస్తోంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సగం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా అవేమీ జరగలేదు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కులు-5 ఎఫ్ (ఫామ్-ఫైబర్-ఫ్యాక్టరీ-ఫ్యాషన్-ఫారిన్) విధానం ద్వారా జౌళి రంగానికి ఊతం ఇస్తాయని కేంద్రం ప్రకటించింది. పార్కులో తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు అనేక రాయితీలు, ప్రోత్సాహకాలను పీఎం మిత్ర ద్వారా అందించే అవకాశం ఉంది.

గత సర్కారు కేటాయించిన నిధులే...

గత బీఆర్ఎస్ సర్కారు పార్కు అభివృద్ధికి టీఎస్ఐఐసీ ద్వారా రూ. 706.87 కోట్లు మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసింది. ఇందులో రైతుల భూములను పార్కు కోసం సేకరించినందుకు పరిహారంగా రూ. 159.27 కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ. 547.60 కోట్లను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసినట్లు టీఎస్ఐఐసీ అధికారులు తెలిపారు. ఈ నిధులతో 21.50 కి.మీ పొడవులో ప్రహరీ, 13.50 కి.మీ పొడవులో అంతర్గత రోడ్లు, 7.60 కి.మీ పొడవులో వీధి దీపాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, 12ఎంఎల్‌డీ నీటి సరఫరా, అంతర్గత నీటి సరఫరా, 5 ఎంఎల్‌డీ సీఈటీపీ నిర్మాణం తదితర పనులు చేపట్టారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పార్కు అభివృద్ధికి నిధులేవీ మంజూరు చేయలేదని తెలుస్తోంది. త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లోనైనా అధికంగా నిధులు పార్కు అభివృద్ధికి కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పార్కు పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయన నిధుల మంజూరు విషయమై ప్రకటన చేసే అవకాశం ఉంది.



పార్కులోని అంతర్గత రోడ్డు

పార్కు ప్రోగ్రెస్ రిపోర్టు ఇలా...

- పార్కు కోసం 1357 ఎకరాల భూ సేకరణ చేపట్టారు.
- పార్కు ఏర్పాటుకు రూ. 1150.47 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా
- పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు 1200 ఎకరాలను లేఔట్ చేశారు.
- అందులో 539.31 ఎకరాలను పరిశ్రమలకు కేటాయించారు.
- గంగదేవిపల్లి నుంచి ఫోర్ లేన్‌తోపాటు చింతలపల్లి రైల్వే స్టేషన సమీపంలో ఆర్‌ఓబీ నిర్మించాల్సి ఉంది.
- గణేశా ఎకో టెక్ (ప్లాస్టిక్ నుంచి దారం తయారు చేసే) కంపెనీ 50.10 ఎకరాల్లో ఏర్పాటు కాగా రూ. 588.25 కోట్ల పెట్టుబడితో నడుస్తోంది. ఇందులో సుమారు 700 మంది కార్మికులు పని చేస్తున్నారు.
- కైటెక్స్ పిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీకి 191.62 ఎకరాల భూమిని కేటాయించగా రూ. 1500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఇందులో సుమారు 11 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉండగా ఏర్పాటు పనులు 80 శాతం పూర్తి చేశారు.
- యంగ్‌వన్ ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ (టీ షర్టులు, ట్రాక్ సూట్‌లు, జర్కిన్లు, క్రీడా దుస్తులు, షూ తదితర తయారు వస్తువులు)కి 297.59 ఎకరాలు కేటాయించగా రూ. 980 కోట్ల పెట్టుబడితో సుమారు 11,700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఈ కంపెనీ పనులు కొనసాగుతున్నాయి. మహిళలకు కుట్టు శిక్షణ కోసం ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.



టెక్స్‌టైల్ పార్కు బోర్డు

గంజాయి సాగుదారుడికి పదేళ్ల జైలు

వరంగల్ లీగల్/పరకాల : వ్యవసాయ భూమిలో మిశ్రమ పంటగా గంజాయి సాగుచేస్తున్న రైతుకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి. అపర్ణాదేవి గురువారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన గొట్టె కుమారస్వామి పోచారం గ్రామ శివారులో గల తన వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేస్తున్నారని ఎస్సై శ్రీకాంత్ రెడ్డికి సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులతోపాటు తహసీల్దార్‌కు సమాచారం అందజేసి తన సిబ్బందితో గంజాయి సాగు చేస్తున్న పంట భూమి వద్దకు వెళ్లాడు. రెవెన్యూ సిబ్బంది చేరుకుని భూమిని పరిశీలించి గొట్టె కుమారస్వామి భూమి అని తేల్చి చెప్పారు. పత్తి చేనులో మిశ్రమ పంటగా గంజాయి మొక్కలు పెరిగి ఉన్నాయని గుర్తించారు. పంచుల సమక్షంలో ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గంజాయి మొక్కలను తొలగించారు. సదర్ ఎస్సై ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తుడు గొట్టె కుమారస్వామికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసు అధికారులు జే నర్సింహులు, రవిరాజ్ పరిశోధించగా సాక్షులను కే పరమేశ్వరి పర్యవేక్షణలో కానిస్టేబుల్ ఎన్. సుధాకర్ కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ప్రేమ నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

పరకాల: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడానికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం పరకాల మండలం పైడిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండి రాజశేఖర్(23) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో గ్రామంలోని ఇరువర్గాల పెద్దలు మందలించి మరోసారి ఆ యువతి జోలికి రాజశేఖర్ వెళ్లొద్దని నిర్ణయించారు. దీనిపై మనస్తాపం చెందిన రాజశేఖర్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికోసం బయటకు వెళ్లి వచ్చిన తల్లి మంజుల ఇంటి తలుపులు తీసే క్రమంలో రాకపోవడంతో అనుమానంతో కిటికీ నుంచి చూడగా కొడుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో కేకలు వేస్తూ ఇంటి పక్కనవారికి తెలపడంతో బలవంతంగా తలుపులు తొలగించి చూడగా రాజశేఖర్ అప్పటికే ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ రవిరాజ్ తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: 'ప్రేమిస్తున్నాం.. పెళ్లి చేసుకోవాలి' అని తరచూ బెదిరిస్తూ మైనర్లు అయిన అక్కాచెల్లెలను ఎత్తుకెళ్లిన కేసులో నేరం రుజువుకావడంతో హనుమకొండ బొక్కల గడ్డకు చెందిన సోనుసింగ్ బాటియా, ఎండీ సమీర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి గురువారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బోడెడ్ల రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ గుండ్ల సింగారం గ్రామానికి చెందిన అక్కాచెల్లెలో ఒకరు ఇంటర్, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. తమ స్నేహితురాలి జన్మదిన వేడుకల్లో ఆమె అన్నయ్య (సోనుసింగ్), మరో వ్యక్తి (సమీర్).. సదరు అక్కాచెల్లెలకు పరిచయమయ్యారు. అనంతరం ప్రేమిస్తున్నామని.. పెళ్లి చేసుకుంటామని లైంగిక వేధింపులకు గురిచేశారు. ఈక్రమంలో 2019 జనవరి 1న తమ నానమ్మతో కలిసి ఫొటో దిగడానికి అక్కాచెల్లెలు పెగడపల్లి డబ్బాల సమీపాన గల ఓ ఫొటో స్టూడియోకు వెళ్లారు. అక్కడ అక్కాచెల్లెలను గమనించిన ఇద్దరు నిందితులు 'నీ స్నేహితురాలు పిలుస్తుంది' అని మాయమాటలు చెప్పి ఆటలో తీసుకుని పారిపోయారు. తమను ప్రేమించాలని దాడి చేస్తూ నగరం మొత్తం తిప్పి చివరకు ఇంటికి వెళ్లండని ఓ ప్రాంతంలో దింపారు. దీంతో అక్కాచెల్లెలు అక్కడి నుంచి నేరుగా గుండ్లసింగారం బొడ్రాయి వద్దకు చేరుకోగా నిందితులు వారి వెనుక వెళ్లి బాలికలను కొట్టారు. ఈ ఘటనలో చెల్లి స్పృహ తప్పి పడిపోగా .. అక్క కేకలు వేసింది. దీంతో నిందితులు పారిపోయారు. అనంతరం బాలికలు తెలిసిన వ్యక్తికి ఫోన్ చేయగా ఆయన ద్వారా సమాచారం తెలుసుకున్న బాధిత బాలికల తండ్రి ఘటనాస్థలికి చేరుకుని కుమార్తెలను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను విచారించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తులు సోనుసింగ్ బాటియా, ఎండీ సమీర్‌కు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పన జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పునిచ్చారు. అప్పటి హనుమకొండ ఏసీపీ డి. చంద్రయ్య, కేయూ ప్రస్తుత సీఐ సంజీవ్ కేసు పరిశోధించారు. మహిళా ఏఎస్సై పరమేశ్వరి, భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ సీహెచ్ నిరజ పర్యవేక్షణలో కే.రాజేందర్, డి. భాస్కర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడిన స్కూల్ బస్సు, పక్కన నుజ్జునుజ్జయిన కారు



గాయపడిన విద్యార్థిని తమ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



ఘటనాస్థలిలో గుమిగూడిన ప్రజలను పంపిస్తున్న పోలీసులు

- ప్రమాద సమయంలో బస్సులో 30మంది విద్యార్థులు
- ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- కారులో ప్రయాణిస్తున్న ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

కమలాపూర్: అతివేగంగా వస్తున్న ఓ కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెంబర్తిలోని ఏకశిల స్కూల్‌కు చెందిన బస్సు పాఠశాల ముగిశాక గురువారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద దింపడానికి బయలు దేరింది. కమలాపూర్ మండలంలోని కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు వెళ్తోంది. ఈక్రమంలో కమలాపూర్ శివారులోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద కన్నూరుకు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో బస్సు వెనకాలే అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో స్కూల్ బస్సు బోల్తా పడగా కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బస్సులోంచి కిందకు దింపేశారు. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సులోని ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు, కారులో ప్రయాణిస్తున్న హుజూరాబాద్‌కు చెందిన ఎండీ.అబ్దుల్, భవానందస్వామి, కరీంనగర్‌కు చెందిన సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను పోలీస్ వాహనంలో, తీవ్ర గాయాలైన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో కారు, స్కూల్ బస్సును రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొర్నపల్లికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. అయితే, కారులో ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన ఎండీ.అబ్దుల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందగా.. అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ప్రమాదంలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



'గ్రేటర్'కు కొత్త మాస్టర్‌ప్లాన్

కార్పొరేషన్ కార్యాలయానికి నూతన భవనం

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి జిల్లా సమస్యలు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హన్మకొండ అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన గ్రేటర్ వరంగల్ మాస్టర్‌ప్లాన్‌తో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నందున గ్రేటర్ సమగ్ర అభివృద్ధికి సర్వే చేయించి కొత్త మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తామని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలు, ఆయన దృష్టికి తీసుకురానున్న ముఖ్య సమస్యలపై మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ పెద్దలు గ్రేటర్ వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను అడ్డగోలుగా చేశారని విమర్శించారు. అందుకే రీసర్వే చేయించి అందరికీ ఆమోద యోగ్యమైన మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా సీఎం సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పరిశీలిస్తారని తెలిపారు. 12 అంతస్తుల వరకే ఆస్పత్రి ఉండాలని నిబంధనలు చెబుతున్నాయని, మిగిలిన భవనం అంతస్తులు ఏ విధంగా ఉపయోగించాలనే విషయం సీఎంతో చర్చిస్తామని తెలిపారు. జిల్లాలో ఆయుర్వేద కళాశాల, బస్టాండ్ అభివృద్ధికి నిధులు, హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు సీఎంకు వివరిస్తామని చెప్పారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొన్నిచోట్ల పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తామని తెలిపారు. పర్యాటకరంగం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా సీఎం చేతుల మీదుగా మహిళలకు రూ.20 కోట్ల చెక్కు అందజేస్తామని మంత్రి సురేఖ తెలిపారు.

మంత్రి మాట్లాడుతుండగా కరెంట్ కట్

సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు వివరించేందుకు గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతుండగా రెండు సార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయంలో సాయంత్రం విద్యుత్ అధికారులు మంత్రిని కలిసి వివరణ ఇవ్వడంతోపాటు ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో టెస్టింగ్ చేస్తుండగా అంతరాయం ఏర్పడిందని, ఎలాంటి పవర్‌కట్ లేదని తెలిపారు.

దయాకర్‌రావు రాడు..రానివ్వం..

విలేకరుల సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే అవకాశం లేదని, ఒకవేళ ప్రయత్నం చేసినా తాము రానివ్వబోమని తెలిపారు. సమావేశంలో పలువురు విలేకరులు ఎర్రబెల్లి కాంగ్రెస్ పార్టీలో చేరికపై అడిగిన ప్రశ్నలకు ఆమె పై విధంగా సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ విషయంలో స్పష్టంగా ఉన్నారని, మిగతా వారి విషయం వేరు.. దయాకర్‌రావు విషయం వేరని చెప్పుకొచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

భార్యను చంపిన భర్త అరెస్ట్

భూపాలపల్లి అర్బన్ : భార్యను హత్య చేసిన భర్తను అరెస్ట్ చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఫకీర్‌గడ్డ సమీపంలోని ఆకుదారివాడకు చెందిన ఇస్లావత్ సుమతిని తన భర్త హతిరామ్ హత్య చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సుమతిపై ఉన్న బంగారాన్ని బాత్రూం పక్కన గోతి తీసి అందులో దాచిపెట్టి, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన భార్యను చంపినట్లు హతిరామ్ తెలిపాడు. దీనిపై మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా హతిరామే.. భార్యను చున్నీని మెడకు బిగించి హత్య చేసినట్లు వెల్లడైందన్నారు. దీంతో హతిరామ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్). సంప్ర: 8376001873, 9643010487, 8376089771, 011-25920179. [DA-5787]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/-. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185226]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి / భోజనం. జీతం: 18K. ఫోన్: 9160900024 / 9640400073. [H-799897]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.